



సైబర్ నేరాలపై అవగాహనకు..



నేడు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్

సందేహాలు నివృత్తి చేయనున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్

సమయం :	సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ :
ఉదయం 11 నుంచి 12 గంటల వరకు	87126 65552

వరంగల్ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పెరిగిన సాంకేతికతతో పాటు ఆన్‌లైన్ మోసాలు, నేరాలు కూడా రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌ల వినియోగం పెరిగిన తర్వాత సైబర్ మోసగాళ్లు మాయమాటలు చెబుతూ.. వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నారు. యాప్‌లు, రుణాలు, ఆఫర్లు అంటూ ఫోన్లు చేసి.. వినియోగదారుల ఖాతాలను లూటీ చేస్తున్నారు. రోజూ ఎక్కడో ఒక చోట.. ఎవరో ఒకరు వయసు, చదువుతో సంబంధం లే కుండా సైబర్ కేటుగాళ్ల వలకు చిక్కుకుంటున్నారు. సొమ్ములు పోగొట్టుకుని మనోవేదనతో ప్రాణాలు కూడా తీసుకుంటున్న వారున్నారు. ఇలాంటి సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్న అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ద్వారా వరంగల్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్‌కు ఫోన్‌చేసి ప్రజలు తమ సందే హాలను నివృత్తి చేసుకోవచ్చు.

అక్రమాలకు చెక్



- అంగన్‌వాడీ సరుకులు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు
- అర్హుల ముఖచిత్రాల నమోదు
- జిల్లాలో ప్రారంభమైన ప్రక్రియ

తొర్రూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్ పెట్టాలని కాంగ్రెస్ ప్రభు త్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయాకేంద్రాలకు సర్కార్ సరఫరా చేస్తున్న సరుకులు, లబ్ధిదారుల జాబితాను మరింత పారదర్శకంగా అమలు చేయాలని భావిస్తుంది. ప్రత్యేక 'ఆన్‌లైన్' యాప్‌ను తయారు చేసి అర్హుల ముఖచిత్రాలను ఎప్పటికప్పుడు 'ఆన్‌లైన్' పోర్టల్‌లో నమోదు చేయాలని సర్కారు ఆదేశించింది.

అందించేవి ఇవే..

జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, గూడూరు, డోర్నకల్ ఐదు ప్రాజెక్టులు ఉండగా.. వాటిల్లో మొత్తం 1,437 అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటిలో 0 నుంచి 6 సంవత్సరాల వయసు గల వారు 39, 130 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. 3,296 మంది గర్భిణులు, 3,537 బాలింతలు పేర్లు నమోదు చేసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారం అందజేస్తున్న విషయం తెలిసిందే. మూడేళ్ల నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులకు ప్రాథమిక విద్యతో పాటు నెలకు 2.5 కిలోల బాలామృతం, ఉడికించిన గుడ్లు ఇస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు 150 గ్రాముల బియ్యం, 30 గ్రాముల పప్పుతో భోజనం వండి అందిస్తున్నారు. ఆరేళ్లలోపు పిల్లలకు 50 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పుతో భోజనం వండి వడ్డిస్తున్నారు. ఇవన్నీ లబ్ధిదారులకు సక్రమంగా అందాలనే ఆలోచనతో ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేసి 'ఆన్‌లైన్' నమోదు ప్రక్రియను చేపట్టింది.

నమోదు ప్రక్రియ ప్రారంభమైంది : ధనమ్మ, జిల్లా సంక్షేమ అధికారి

ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో అర్హులైన లబ్ధిదారులకు నేరుగా అందించాలని ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. జిల్లాలో ఇప్పటి వరకు 8,527 మంది లబ్ధిదారుల వివరాలు 'ఆన్‌లైన్'లో నమోదయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని వివరాలు నమోదు చేస్తాం.

టీహెచ్‌ఆర్ లబ్ధిదారులకు..

అంగన్‌వాడీ కేంద్రాలకు రాని వాళ్లకు టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్) అందిస్తున్నారు. మెజార్టీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ సరుకులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటికి చెక్ పెట్టి పారదర్శకతతో పెద్దపీట వేయడంలో భాగంగా ప్రభుత్వం యాప్ అందుబాటులోకి తెచ్చింది. తొలి దశలో టీహెచ్‌ఆర్ లబ్ధిదారుల ముఖచిత్రాలు నమోదు చేయాలని నిర్ణయించి మార్చి మొదటి తేదీ నుంచి ప్రారంభించింది. చిన్నారుల తల్లుల ముఖచిత్రం, ఆధార్ నంబర్, ఫోన్‌నంబర్ యాప్‌లో నమోదు చేయగానే సరుకులు తీసుకున్న వెంటనే ఫోన్‌కు మెస్సేజ్ వస్తుంది.

మళ్లీ కేసీఆర్ సీఎం కావడం ఖాయం

- ప్రజలు బీఆర్‌ఎస్‌ను కోరుకుంటున్నారు
- హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ సర్కారు విఫలం
- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



బొమ్మకల్‌లో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : త్వరలోనే కేసీఆర్ సీఎం కావడం ఖాయమని, రాష్ట్రంలోని ప్రజలు బీఆర్‌ఎస్, కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జోస్యం చెప్పారు. బుధవారం బొమ్మకల్ గ్రామంలో బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఎర్రబెల్లితో పాటు, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో అట్టర్ ప్లాప్ అయ్యిందని, ఏడాదిలోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని, హామీలు గాలిలో కలిశాయని, ఆ పార్టీపై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటేనే సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గడపగడకూ వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌ను ప్రజలే బొందపెడ్తరు..

- మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్

మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలే బొందపెడతారని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. వచ్చే స్థానికల్లో కాంగ్రెస్ తగిన గుణంపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, సోమేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ దీపక సోమనర్సింహారెడ్డి, ఎన్‌ఆర్‌ఐ విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్రామయ్య, గంగాధర్, సమ్మయ్య, హరీష్, రామ్మూర్తి, ఐలయ్య, శంకర్, అనుదీప్, బిక్షపతి, మధు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవల శాఖ ప్రారంభం



కేసముద్రంలో కార్గో సేవలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు

కేసముద్రం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ ఉప్పరపల్లిరోడ్‌లో బుధవారం ఆర్‌టీసీ లాజిస్టిక్స్ (కార్గో సేవలను) శాఖను సంస్థ రీజియన్ లాజిస్టిక్స్ మేనేజర్ వి.రామారావు ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు ఏపీ, బెంగళూరు ప్రాంతాలకు ఇక్కడి నుంచి వస్తువులను పంపే అవకాశం ఉందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామారావు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ రామయ్య, వేలాద్రి, నరేందర్, శివకుమార్ పాల్గొన్నారు.

మటన్ వండలేదని.. భార్యను కొట్టి చంపిన భర్త



మాలోతు కళావతి (ఫైల్)

- మాంజాతండాలో ఘటన
- పరారీలో నిందితుడు.. ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ

6

తేనెటీగల పెంపకంతోనే ఆర్థిక స్వావలంబన



తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న సునీత

గూడూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : రైతులు తేనెటీగల పెంపకంపై ఆసక్తి చూపాలని, దీంతో కర్షకులు ఆర్థిక స్వాలంబన ద్వారా అభివృద్ధి చెందవచ్చని కీటక విభాగం వ్యవసాయ శాస్త్రవేత్త సునీత అన్నారు. గూడూరు రైతు వేదికలో నేషనల్ బీబోర్డ్ ఆర్థిక సహకారంతో బుధవారం శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. తేనెటీగల పెంపకం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ఉద్యాన పంటలైన నువ్వులు, ఆవాలు, కుసుమకంది, పొలాల్లో తేనెటీగల పెట్టెలను అమర్చి లాభాలు పొందవచ్చన్నారు. ఏడాది పొడవునా వాతావరణం పరిస్థితులు ఎలా ఉన్నా తేనెటీగల పెంపకానికి ఆటంకం కలుగదన్నారు. శాస్త్రవేత్త రజినీకాంత్, గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల, ఏడీఏ శ్రీనివాసరావునాయక్, ఏవో అబ్దుల్‌మాలిక్, ఏఈవో వినయ్, నేచరల్ హనీ ఫౌండర్ సంజన పాల్గొన్నారు.

మందులు ఇచ్చేప్పుడు గడువు తేదీలను సరి చూడాలి

డీఎంహెచ్‌వో మురళీధర్



సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్

నెహ్రూసెంటర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మందులు అందజేసే ముందు, ఒక్కసారి గడువు తేదీని పరిశీలించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) మురళీధర్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్ సమావేశ మందిరంలో బుధవారం ఫార్మసిస్టులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులు గడువు ముగియకుండా చూసుకోవాలని, మందుల యొక్క ఇండెంట్‌ను మూడు నెలల ముందుగానే సెంట్రల్ డ్రగ్స్‌స్టోర్‌కు లేటర్ పెట్టాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలకు మందుల డోసుల వివరాలపై అవగాహన కల్పించారు. ఎనిమియా ఉన్న గర్భిణులకు ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలను పంపిణీ చేయాలని, ఆరు నెలల నుంచి 59 నెలల పిల్లలకు ఐఎఫ్‌ఏ సిరఫ్, 5 ఏళ్ల నుంచి 9 సంవత్సరాల పిల్లలకు ఐఎఫ్‌ఏ పింక్ కలర్ ట్యాబ్లెట్‌లను అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 10 ఏళ్ల నుంచి 19 వయస్సు పిల్లలకు ఐఎఫ్‌ఏ నీలం రంగుమాత్రలను ఏడాది పొడవునా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో సారంగం, కేవీ రాజు, మంగమ్మ, రామకృష్ణ, అరుణ్ పాల్గొన్నారు.

రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలి

- జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల



బొద్దుగొండ క్లస్టర్ రైతు వేదికను తనిఖీ చేస్తున్న విజయనిర్మల

గూడూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉండాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారిణి విజయనిర్మల సూచించారు. బొద్దుగొండ క్లస్టర్ రైతువేదికను బుధవారం ఆమె తనిఖీ చేశారు. రైతువేదికలోని రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏళ్లవేళలా రైతులకు పంటలకు కావాల్సిన సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావునాయక్, ఏవో అబ్దుల్‌మాలిక్, ఏఈవో మనోజ్‌కుమార్ ఉన్నారు.

టైగర్‌జోన్ పేరిట అరెస్టు చేయడం తగదు

తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్

గూడూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో రింగారిట్ గ్రామంలో టైగర్‌జోన్ పేరుతో గత వారం రోజుల నుంచి అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నామని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ తెలిపారు. గూడూరు మండల కేంద్రంలోని కొమురంభీం కాలనీలో బొల్లి సారయ్య అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైగర్‌జోన్ పేరిట ఆదివాసీలను తరలించే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. లేని పక్షంలో ఆదివాసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఇదే గ్రామంలో కోవ జంగు, కోవ రాములు అడవిని నరికారనే నేపంతో అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేసి కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వర్‌రావు, జేఏసీ చైర్మన్ కొట్టెం ముఖర్జీ, మంగయ్య, మల్లేష్, నాగేష్, సునీల్, రాజు, సురేష్, సురేందర్, ఎర్రయ్య పాల్గొన్నారు.

మేడారంలో భక్తుల సందడి



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సందడి నెలకొంది. సమక్క, సారలమ్మ వనదేవతలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం(బెల్లం), యాట మొక్కులను సమర్పించుకున్నారు. సుమారు 5వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని వినతి



కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సెంటర్లను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఏవో రాజ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్డీ.దావూద్, రత్నం రాజేందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లను, ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని అన్నారు. దీనివల్ల పూర్వ ప్రాథమిక ఎలిమెంటరీ స్థాయి విద్యార్థులను ప్రైమరీ స్కూళ్లకు పంపిస్తే అంగన్‌వాడీ సెంటర్లు మూతపడే పరిస్థితి ఉందని అన్నారు. 50 ఏళ్లుగా అనేక ప్రజాదరణ పొందిన ఐసీడీఎస్‌ను కేంద్ర ప్రభుత్వం బలోపేతం చేయాల్సిందిపోయి రకరకాల పథకాలతో నిర్వీర్యం చేసే విధానాలను అవలంబిస్తుందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా వంతపాడుతుందని అన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీలకు ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు అందించాలని, ప్రమోషన్ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు పెరిగిన వేతనాలు ఇస్తూ 11నెలల ఏరియర్స్ అందించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2లక్షలు పెంచాలని, ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 17, 18 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట 48గంటల నిరసన ధర్నా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కూరెందుల సమ్మక్క, పద్మారాణి, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, సరిత, దీప, లక్ష్మి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

కేసముద్రం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం పెనుగొండ గ్రామ చెరువులో స్నానం చేసేందుకు దిగి ప్రమాదవశాత్తు మునిగి షేక్ ఇస్మాయిల్(22) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. కొత్తగూడెంకు చెందిన ఇస్మాయిల్ కొద్దినెలల క్రితం తల్లిదండ్రులతో సహా పెనుగొండకు ఉపాధి నిమిత్తం వచ్చాడు. తండ్రి ఇమాం మేకలు కాయడం, తల్లి కూలీ పని, ఇస్మాయిల్ సెంట్రింగ్ పని చేస్తున్నారు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం చెరువులో స్నానం చేసేందుకు ఇస్మాయిల్ దిగగా ప్రమాదవశాత్తు మునిగిపోయి ఈత రాక మృతి చెందాడని, బుధవారం సాయంత్రం చెరువులో మృతదేహం తేలి ఉండడం చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. రాత్రి మృతదేహాన్ని వెలికితీసి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాళేశ్వరా మన్నించు..

- సరస్వతీ పుష్కరాల పనులకు గ్రహణం
- ఇప్పటి వరకు ప్రారంభం కాని వైనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

మహదేవపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరాలయ అభివృద్ధికి గ్రహణం పట్టింది. సరస్వతీ పుష్కరాలు సమీపిస్తున్నా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రతి 12 ఏళ్లకోసారి త్రివేణి సంగమం గోదావరి వద్ద సరస్వతీ పుష్కరాలు జరుగుతుంటాయి. ఈసారి మే 15 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. పుష్కరాలకు భక్తుల కోసం సౌకర్యాలు కల్పించడంతోపాటు ఆలయ అభివృద్ధి పనుల కోసం ఈ నిధులను కేటాయించారు. అయితే.. ఇప్పటి వరకూ పనులు ఏమాత్రం మొదలు కాలేదు. ఈ నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పుష్కరాలు సమీపిస్తున్నా పనులు ప్రారంభించకపోవడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



కాళేశ్వరంలో అభివృద్ధి పనుల కోసం పోసిన కంకర

రూ.25 కోట్లు మంజూరైనా..

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో పుష్కరాల కోసం రూ.25 కోట్లు మంజూరైనా ఇంతవరకూ తట్టెడు మట్టి పోసింది లేదు. ఒక్క పని కూడా చేసింది లేదు. పుష్కర ఘాట్ అభివృద్ధి, వీఐపీ ఘాట్‌కు రోడ్డు, పార్కింగ్, ఆలయంలో కొత్త అభివృద్ధి పనులు, బస్టాండ్ రహదారి, ఇతరాత్ర పనులు ఇంకా మొదలు కాలేదు. ఇసుక, కంకర కుప్పలు పోసి ఉంచారు గానీ, పనులు మాత్రం ప్రారంభించలేదు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ వరుస సమీక్షలు నిర్వహించి అభివృద్ధి పనులపై ఆరా తీసినా ఇంతవరకు అడుగులు ముందుకు పడకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. పుష్కరాలు సమీస్తున్న నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో పనులు ప్రారంభించినా హడావిడిగా పూర్తిచేసి చేతులు దులుపుకుంటారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఆలయం నుంచి గోదావరి దాకా చలువ పందిళ్లు, నీడ ప్రదేశాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. గోదావరి ఒడ్డున స్నానపు గదులు, మహిళలకు దుస్తులు మార్చుకొనే గదులతో పాటు పలు శాశ్వత పనులు చేయాల్సి ఉండగా ఇవన్నీ సకాలంలో పూర్తవుతాయా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.



అసంపూర్తిగా అన్నసత్రం నిర్మాణం

అర్థాంతరంగా ఆగిన ఆలయ అభివృద్ధి పనులు

తొమ్మిది సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయ అభివృద్ధి కోసం రూ.25 కోట్లు మంజూరు చేశారు. అప్పటి పనులు ఇప్పటివరకు పూర్తికాకపోగా కొన్ని భవనాలు మధ్యలోనే ఆగిపోయాయి. గతంలోనే నిధులు మంజూరైనా ఆ డబ్బులు లెక్కాపత్రం లేకుండా పనులు పూర్తి కాలేదు. వంద రూముల వసతి గృహాల నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. అన్నసత్రం పనులు మధ్యలోనే ఆగిపోయాయి. భవనాల నిర్మాణాలను సగంలోనే వదిలేయడంతో అక్కడ చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పెరిగాయి.

మటన్ వండలేదని.. భార్యను కొట్టి చంపిన భర్త

- మహబూబాబాద్ జిల్లా మాంజాతండాలో ఘటన
- పరారీలో నిందితుడు.. ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ



మాంజాతండాలో కళావతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై నగేష్

సీరోలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక సమాజంలో మనుషులు మృగాల్లా ప్రవర్తిస్తున్నారు. ప్రాణాలంటే విలువ లేకుండా, రాక్షసుల్లాగా క్రూరత్వాన్ని ప్రదర్శిస్తూ చిన్నచిన్న విషయాలకు అయిన వారినే కడతేరుస్తున్నారు. నిందితులుగా మారుతూ కటకటాల పాలవుతున్నారు. మటన్ వండలేదని కట్టుకున్న భార్యనే కొట్టి చంపాడు ఓ ఘనుడు. ఈ దారుణ ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం బూరుగుచెట్టుతండా గ్రామపంచాయతీ పరిధిలోని మాంజాతండాలో మంగళవారం రాత్రి జరిగింది. దీనికి సంబంధించి బుధవారం మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మాంజాతండాకు చెందిన మాలోతు బాలుకు అదే తండాకు చెందిన కళావతితో 17ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉండగా.. కుమారుడు శరత్ వరంగల్ జిల్లాలోని అశోక్‌నగర్‌లో ఉన్న సైనిక గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కూతురు శ్రావణి సీరోల్ మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులంలో 8వ తరగతి చదువుతోంది. ఇక బాలు, కళావతి(38) దంపతులు ఇంటి వద్ద ఉంటూ.. తమకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈక్రమంలో సదరు తండాలో మంగళవారం ఓవృద్ధురాలు మృతి చెందగా, ఆమె అంత్యక్రియలు రాత్రి 7 గంటల సమయంలో పూర్తిచేశారు. అనంతరం రాత్రి వేళ ఓ గొర్రెపోతును కోసి, తలా కొంచెం మాంసాన్ని వారివారి ఇళ్లకు తీసుకుపోయారు. రాత్రి 11 గంటల సమయంలో ఆ మటన్‌ను ఇంటికి తీసుకువచ్చిన బాలు.. వండాలని భార్య కళావతిని కోరాడు. అంత రాత్రి సమయంలో మటన్ వండే విషయంలో కళావతి అభ్యంతరం చెప్పగా.. అప్పటికే మద్యం మత్తులో ఉన్న బాలు ఆమెతో గొడవ పడ్డాడు. అది కాస్తా ఇద్దరి మధ్య ఘర్షణగా మారగా విషయం తెలుసుకున్న అదే తండాలోని కళావతి తల్లిదండ్రులు ఇస్లావత్ లక్ష్మి-వెంకన్న వారి ఇంటికి వచ్చి సర్దిచెప్పి, గొడవను సద్దుమణిగేలా చేశారు. వారు వెళ్లిపోయాక బాలు భార్యతో మళ్లీ గొడవపడి, తీవ్రంగా కొట్టి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం కళావతి తల్లిదండ్రులు మరోమారు కూతురు ఇంటికి వచ్చి చూడగా అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. దీంతో కళావతి తల్లిదండ్రులు సీరోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, సీరోలు ఎస్సై నగేష్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా.. నిందితుడు బాలు పరారీలో ఉన్నాడు.

పైఅంతస్థు నుంచి పడి మహిళ మృతి

కృష్ణకాలనీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని సింగరేణి ఎండీక్వార్టర్స్ పైఅంతస్తు నుంచి కిందపడి మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ తెలిపిన ప్రకారం... ఎండీక్వార్టర్స్‌లో నివాసముంటున్న బోగ లీలావతి (48) క్వార్టర్స్‌లోని పైఅంతస్థుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే ఆమె మృతి చెందింది. లీలావతి మతిస్థిమితం సరిగ్గాలేదని, ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి చనిపోయిందని మృతురాలి భర్త బోగ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సంపత్ మృతదేహం

మహబూబాబాద్ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లాకేంద్రం శివారు సాలార్‌తండా సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపినవివరాల ప్రకారం... కురవి మండలం సూదనపల్లి గ్రామానికి చెందిన కొల్లబోయిన సంపత్ (27) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ రైస్‌మిల్లులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో సాలార్‌తండా సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన ఢీకొన్నాడు. ఈ ఘటనలో సంపత్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారరా జిల్లా అస్పత్రికి తరలించారు. సంపత్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి సంపత్‌కు భార్య అఖిల, ఇద్దరు కుమారులు ఉన్నారు.

12 కిలోల గంజాయి పట్టివేత

కాటారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాముత్తారంలో పోలీసులు 12 కిలోల 765 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాటారం తన కార్యాలయంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బీహార్ రాష్ట్రంలోని నలంద జిల్లా గౌరి గ్రామానికి చెందిన 49ఏళ్ల గణేష్‌ఠాగూర్ మూడేళ్లుగా గణపురం మండలంలోని చెల్పూరులో రైస్ మిల్లులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. జీతం సరిపోక అధిక మొత్తంలో ఈజీగా డబ్బులు సంపాదించాలనే దురాశతో గంజాయి విక్రయాలు చేయాలని తలచాడు. ఈ క్రమంలో విశాఖపట్నం జిల్లాలోని అటవీగ్రామాల పరిధిలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మహాముత్తారం పరిసర గ్రామాల్లో అధిక ధరలకు విక్రయించడాకి మంగళవారం రాగా విశ్వసనీయ సమాచారంతో మహాముత్తారం ఎస్సై మహేందర్ కుమార్ తన సిబ్బందితో గణేష్‌ఠాగూర్‌ను పట్టుకున్నాడు. అతడి వద్ద ఉన్న బ్యాగులో తనిఖీ చేయగా 12కిలోల 765గ్రాముల గంజాయి దొరికింది. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.2.55 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. గతంలోనూ గణేష్‌ఠాగూర్‌పై గణపురం పోలీస్‌స్టేషన్లో గంజాయి కేసు నమోదై ఉంది. జైలుకు వెళ్లి బెయిలుపై వచ్చిన అతడు మళ్లీ అదే దందా చేస్తూ పట్టుబడ్డాడని డీఎస్పీ చెప్పారు. నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సీఐ నాగార్జునరావు, మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడి అరెస్టును చూపిస్తున్న డీఎస్పీ, సీఐ



తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారులో బావిలో అడుగంటిన నీరు



కంఠాయపాలెం గ్రామంలో నెర్రెలు బారిన వరి పొలం

అడుగంటిన భూగర్భ జలాలు

- ఎండుతున్న పొలాలు
- సాగునీటి కోసం రైతుల ఇబ్బందులు

తొర్రూరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో రోజు రోజుకు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మాదిరిగానే ఎస్సారెస్పీ జలాలు వస్తాయనే ఆశతో భారీగానే వరి సాగు చేసిన రైతులు నీరు లేకపోవడంతో విలపిస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం కొంతమేర అధికంగా ఉన్నా, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు, బావులు, చెరువుల్లో నీరు తగ్గింది. ఇది ఇలానే కొనసాగితే మార్చి, ఏప్రిల్ చివరి వరకు పంట చేతికి వచ్చే సమయంలో నీరందే అవకాశం లేకుండా పోతుంది. గత సంవత్సరం మార్చిలో 6.36 మీటర్లు ఉంటే ఈ ఏడాది ఫిబ్రవరిలోనే 5.16 మీటర్లు ఉంది అంటే 1.2 మీటర్ల వరకు నీటి మట్టం పడిపోయిందని సంబంధిత అధికారులుచెబుతున్నారు. ఎండ తీవ్రత పెరుగకముందే ఈ విధంగా నీటిమట్టం పడిపోతే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మండలంలో 16వేల ఎకరాల వరకు వరి సాగు, 2,400 ఎకరాల మొక్కజొన్న సాగు జరుగుతుంది. మొక్కజొన్న కొంతమేర చేతికి వచ్చే అవకాశం ఉన్నా, పొట్టదశలో ఉన్న వరితో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎస్సారెస్పీ జలాలు అనుకూలంగా రావడంతో కొంత భూగర్భ జలాలు పైన ఉండేవి. బావులు, బోర్ల కింద వేసిన పొలాలు చేతికివచ్చేవి. ప్రస్తుతం భూగర్భ జలాలు పడిపోవడంతో చేతికివచ్చే అవకాశం లేకుండా పోతోంది. జిల్లాలో నీటి సాంద్రత మీటర్లు 66 ఉండగా ప్రతిచోట కొంత మేర తగ్గిపోయినట్లు అధికారులు తెలిపారు. తొర్రూరు మండలం హరిపిరాల గ్రామంలో 2024 మార్చిలో 0.98 మీటర్లు ఉండగా 2025 ఫిబ్రవరిలో 1.35 మీటర్లు, తొర్రూరులో 2024 మార్చిలో 13.71 మీటర్లు ఉండగా 2025 ఫిబ్రవరిలో 7.85 మీటర్లు అంటే 5.86 మీటర్లు పడిపోయింది. పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లిలో 2024 మార్చిలో 5.01 మీటర్లు ఉండగా, 2025 ఫిబ్రవరిలో 5.33 మీటర్లు కొంత మేరకు పెరిగింది. చిన్నవంగరలో 2024 మార్చిలో 3.65 ఉండగా 2025 ఫిబ్రవరిలో 3.01 మీటర్ల వరకు నమోదైంది. మార్చి ముగిసే సమయానికి మరింతగా భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదం ఉందని, పొదుపుగా వాడుకోవాలని అధికారులు వెల్లడిస్తున్నారు.

ఎస్సారెస్పీ జలాలు విడుదల చేయాలి

దొనుక ఉప్పలయ్య, అమ్మాపురం గ్రామ రైతు



బావులు, బోర్లలో నీరు సరిపోవడం లేదు భూగర్భ జలాలు అడుగంటాయి. ఎస్సారెస్పీ జలాలు వాటాబందీ కాకుండా సమృద్ధిగా విడుదల చేయాలి. వరి పంట పూర్తిగా పొట్ట, పాలు పోసుకునే దశలో ఉంది. మరో నెల రోజుల పాటు నీరందించాలి.. లేదంటే ఎండిపోతోంది. నీరు విడుదల చేస్తే బావులు, బోర్లలో కొంతమేర భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ

భూపాలపల్లిటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ(ఏఎల్ఐఎంసీవో), సమగ్ర శిక్ష సౌజన్యంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను డీఈవో ఎం.రాజేందర్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 99 మందికి ఈ పరికరాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. పరికరాలకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా ఐఈఆర్పీలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. సమగ్ర శిక్ష ద్వారా భవిత పాఠశాలలకు వచ్చే దివ్యాంగ పిల్లలకు ఎస్కార్ట్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సులు వచ్చినట్లు తెలిపారు. అలాగే వీరికి స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎంఈవో దేవానాయక్ మాట్లాడుతూ ప్రతిసారి జరిగే క్యాంపులకు తప్పనిసరిగా హాజరై పేరు నమోదు చేసుకోవాలని కోరారు.



దివ్యాంగులకు పరికరాలు పంపిణీ చేస్తున్న డీఈవో రాజేందర్

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, ఏఎంవో లక్ష్మణ్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజగోపాల్, ప్రతినిధులు ప్రియవర్మ, సర్వన్‌కుమార్, తుషార్, రతన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికుల వేతనాల్లో అన్యాయం

- మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్

ములుగు కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వానికి విద్యా కమిషన్ చైర్మన్ అందజేసిన రిపోర్టులో వంట కార్మికుల వేతనాల అంశం లేకపోవడం అన్యాయమని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకం నిర్వహిస్తున్న విధానంపై అధ్యయనం చేసే విషయంలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి వంటకార్మికుల పరిస్థితులను అధ్యయనం చేసి ప్రభుత్వానికి రిపోర్టు అందజేశారని తెలిపారు. అయితే ఇందులో వంటకార్మికుల వేతనాల అంశం లేదని పేర్కొన్నారు. మరొకసారి పరిశీలన చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వంట కార్మికులకు రూ.10వేల వేతనంతో పాటు మెనూ చార్జీ ప్రతి విద్యార్థికి రూ.25 చొప్పున చెల్లించాలని, వంట బిల్లులు సకాలంలో అందించే విధంగా ప్రభుత్వానికి సూచనలు, సలహాలు అందించాలని ఆయన కోరారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)


పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2243	2100
పల్లికాయ (సూక)	7300	6500
పల్లికాయ (పచ్చిది)	4400	3400
కందులు	6656	5540
పెసళ్లు	7250	4645
పత్తి	6960	5800
పసుపు (కాడి)	7153	6522
పసుపు (గోల)	6219	6133
తేజ మిర్చి	13400	9000
డిడి	12500	12500
వండర్‌హాట్	16500	11500
ఎల్లో మిర్చి	17000	15000
యూఎస్341	13100	9500
దేశీ	32000	25500
సింగిల్‌పట్టి	37500	35000
దీపిక	16500	15245
తాలు మిర్చి	6500	3000


- వరంగల్ వ్యవసాయం

మూత్రపిండం.. మేలుకోకపోతే గండం!

- రోజురోజుకు పెరుగుతున్న కిడ్నీ సంబంధ సమస్యలు
- అవగాహన లోపమే అసలు సమస్య

నేడు వరల్డ్ కిడ్నీ డే





వరంగల్ మెడికల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మానవ శరీరంలో మూత్రపిండాలదే కీలకపాత్ర అన్న విషయం అందరికీ తెలిసిందే. కిడ్నీలకు రోజుకు 200 లీటర్ల నీటిని శుద్ధి చేసే శక్తి ఉంటుందట. అత్యాధునిక వాటర్ ఫిల్టర్ కూడా వీటి ముందు దిగదుడుపేనట. అలాంటి కీలకమైన మూత్రపిండాల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం, అవగాహన లోపం కారణంగా రోజురోజుకు మూత్రపిండ సంబంధ సమస్యల బారిన పడుతున్న వారు ఎక్కువవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రక్తపోటు, మధుమేహం లాంటి సాధారణ వ్యాధుల జాబితాలోకి కిడ్నీ వ్యాధులు కూడా చేరే ప్రమాదం ఉంది. ఒకప్పుడు వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి మాత్రమే కిడ్నీ సమస్యలు వచ్చేవి. కానీ ప్రస్తుతం ఏ కారణం లేకుండానే.. ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే వయసుతో సంబంధం లేకుండా మూత్రపిండ సమస్యలు ఏర్పడుతున్నారు. వ్యాధి గురించి కళ్లు తెరిచేలోపే వ్యాధి ముదిరి డయాలసిస్, ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు దారితీస్తోంది. ఈ క్రమంలో మూత్రపిండాల ఆరోగ్యం విషయంలో మేలుకోకపోతే ప్రాణాలకే గండమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ కిడ్నీ సంబంధ సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రతీ ఏడాది మార్చి రెండో గురువారాన్ని వరల్డ్ కిడ్నీ డేగా పాటిస్తున్నారు.

కిడ్నీ వ్యాధులకు ఇవే కారణాలు


పిడికిలి పరిమాణంలో ఉండే మూత్రపిండాలు శరీర అవయవాలు ఆరోగ్యంగా ఉండేలా రక్తం నుంచి విషాన్ని, అదనపు నీటిని తొలగించడానికి, రక్తపోటును నియంత్రించడానికి, ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేసేందుకు, ఎముకలను ఆరోగ్యంగా ఉంచేందుకు ఉపయోగపడతాయి. అదే విధంగా సోడియం, పొటాషియం లాంటి అనేక ఖనిజాలు, అణువుల రక్తప్రవాహ స్థాయిలను నియంత్రిస్తాయి. రక్తఆమ్లతను నియంత్రించడంలో సహాయ పడతాయి. శరీరం మొత్తంలో రసాయన సమతుల్యతను నియంత్రించడంలో కిడ్నీలు క్రియాశీలకంగా పని చేస్తాయి. ఇక కిడ్నీ సమస్యలకు మధుమేహం, అధిక రక్తపోటు, ఇన్ఫెక్షన్లతోపాటు వివిధ ఔషధాల ప్రభావం, శరీరంలో నీటి శాతం తగ్గినప్పుడు వాంతులు, విరోచనాలు లాంటివి ఇబ్బంది పెట్టినప్పుడు గుండె, కాలేయం, పనితీరు మందగించినప్పుడు, కిడ్నీలకు రక్త సరఫరా తగ్గినప్పుడు కూడా కిడ్నీ వ్యాధులు సంభవిస్తాయి. కిడ్నీలో రాళ్లు పడటం, బ్లాడర్‌లో రాళ్లు అడ్డుపడి మూత్ర ప్రసరణ తగ్గిపోవడం, మూత్రం వెనక్కి వెళ్లిపోయి ఒత్తిడి పెరగడం వల్ల ప్రోస్టేట్ సమస్యలు కూడా ఏర్పడి కిడ్నీలపై భారం పడుతుంది. మూత్రం తక్కువగా వస్తు కాళ్లలో, కాళ్ల చుట్టూ వాపు వస్తుంది. ఊపిరి తిత్తుల్లో నీరు చేరడం వల్ల ఆయాసం, దగ్గు ఇబ్బంది పెడతాయి. కొన్ని కొన్ని సందర్భాల్లో ఫిట్స్ కూడా రావచ్చు. కొన్ని సందర్భాల్లో కోమాకు కూడా వెళుతూ ఉంటారు. కిడ్నీలు పూర్తిగా దెబ్బతిన్న తర్వాత చివరి దశలో కొందరికి బయటపడుతుంది. ఇలాంటి వారిలో త్వరితగతిన వ్యాధిని గుర్తించడం కష్టసాధ్యం అవుతుంది.

అప్పుడే డయాలసిస్

కిడ్నీ పనితీరు 10శాతం కంటే తక్కువగా పడిపోయినప్పుడు రోగికి డయాలసిస్ తప్పదు. అంతే కాకుండా హఠాత్తుగా మూత్రం నిలిచిపోయినప్పుడు, ఊపిరి తిత్తుల్లో నీరు చేరి ఆయాసం అనిపిస్తుంది. శరీంలో యాసిడ్స్, పొటాషియం స్థాయిలు పెరిగినప్పుడు కిడ్నీ పనితీరుతో సంబంధం లేకుండా రోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. ఒక్కసారి డయాలసిస్ మొదలైతే జీవితాంతం చేయించుకోఆల్సిన అవసరం ఉండదు. తాత్కాలిక రుగ్మతలు అయితే సమస్య పరిష్కారం అయ్యేంత వరకు మాత్రమే డయాలసిస్ చేస్తే సరిపోతుంది. కిడ్నీ పనితీరు మెరుగయ్యాక డయాలసిస్ నిలిపివేస్తారు. అయితే దీర్ఘకాలిక అనారోగ్య పరిస్థితుల్లో జీవితాంతం చేయాల్సి ఉంటుంది.

సూపర్ స్పెషాలిటీలో కిడ్నీ వైద్య సేవలు

ఎంజీఎం ఆస్పత్రికి అనుబంధంగా కాకతీయ మెడికల్ కళాశాలలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కిడ్నీ సంబంధం వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. నెఫ్రాలజీ విభాగంలో ఒక విభాగం అధిపతి, ముగ్గురు వైద్యులు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, యురాలజీ విభాగంలో ఒక విభాగం అధిపతి, నలుగురు వైద్యులు, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.



డయాలసిస్ సెంటర్‌లో సౌకర్యాలు నిల్

కాకతీయ వైద్య కలాశాల ఆవరణలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌లో సరైన సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిడ్నీ సంబంధ సమస్యలతో వస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో 2022 జూలై 7న ఇక్కడ నెఫ్రాలజీ విభాగాన్ని ప్రారంభించారు. వారానికి రెండుసార్లు ఓపీ సేవలు నిర్వర్తిస్తుండగా నెలలో 500 వరకు ఓపీ ఉంటుంది. వారిలో 200 మంది రోగులు ఆస్పత్రిలో అడ్మిట్ అయి చికిత్స పొందుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు

కిడ్నీ సంబంధిత వ్యాధి క్షణాలు సులభంగా బయటపడవు. కాబట్టి సంవత్సరానికి ఒక్కసారైనా కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్, సీరం క్రియాటిన్, కిడ్నీ పనితీరును తెలియజేసే గ్లోమేరు లార్ ఫిల్టరేషన్ రేట్ పరీక్షలు విధిగా చేయించుకోవాలి. వీటికి తోడు బీపీ, షుగర్ తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలి. రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాయామం చేయాలి. ధూమపానానికి దూరంగా ఉండాలి. పెయిన్ కిల్లర్స్ సప్లిమెంట్ వాటిని సాధ్యమైనంత మేర తగ్గించాలి. శరీర బరువును బట్టి నీరు తాగాలి. రోజుకు కనీసం 3లీటర్ల నీరు తాగాల్సి ఉంటుంది. నీరు మరీ ఎక్కువ తాగినా మూత్రపిండాలపై భారం పడి పనితీరు దెబ్బతింటుంది.

కిడ్నీ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



కిడ్నీ సమస్యలపై నిర్లక్ష్యం చేయవద్దు. సమస్య ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించాలి. ప్యాకెట్ ఫుడ్, జంక్‌ఫుడ్, సోడా, కొలెస్ట్రాల్ లాంటి వాటిని పూర్తిగా తగ్గించాలి. వేసవికాలంలో మూత్ర పిండాల్లో రాళ్లు, అక్యూట్ కిడ్నీ ఇంజరీ నివారించేందుకు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవిలో డిహైడ్రేషన్ వల్ల మూత్రపిండ సమస్యలు ఉత్పన్నం అవుతాయి. రోజుకు కనీసం 2.5లీటర్ల నుంచి మూడు లీటర్ల నీటిని తాగాలి. ఉష్ణోగ్రత పెరిగిన కొద్ది నీటిని కూడా మరింత తీసుకోవడం మంచిది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా సహకరిస్తాయి. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవలి. షుగర్ లెవెల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. ప్రతిరోజు 30 నుంచి 45 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయడం వల్ల మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంటాయి. మూత్రపిండాల ఆరోగ్యాన్ని క్రమంగా పరీక్ష చేయించుకోవాలి.

\- డాక్టర్ బచ్చు చందుకృష్ణ, ఎంఎస్, ఎంసీహెచ్, యురాలజిస్టు

అధికంగా పెయిన్ కిల్లర్స్ వాడొద్దు



ఈ మధ్యకాలంలో బీపీ, షుగర్, ఊబకాయం ఉన్న వారితో పాటు పెయిన్ కిల్లర్స్ వాడే వారిలో మూత్రపిండ వ్యాధులు విపరీతంగా పెరుగుతున్నాయి. చెరుకు రసం, బార్లీ నీళ్లు, పుచ్చకాయ వంటి సహజ మూత్ర విసర్జ ఉత్ప్రేరకాల రకాలు తీసుకోవాలి. ఈ పానీయాలు మూత్రాన్ని అధికంగా ఉత్పత్తి చేయించి చిన్న చిన్న రాళ్లను విసర్జించడంలో సహాయ పడతాయి. కనీసం ఆరు నెలలకోసారి అయినా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

\- డాక్టర్ పూస కుమారస్వామి, నెఫ్రాలజిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్ , ఎంజీఎం



ర్యాలీని ప్రారంభించిన బిషప్..



చర్చిలో ప్రసంగిస్తున్న ఫాదర్‌లు

వైభవంగా ఫాతిమామాత మహారథ ప్రదక్షిణ

భారీగా హాజరైన క్రైస్తవులు.. కొనసాగుతున్న ఉత్సవాలు

కాజీపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ఫాతిమానగర్‌లోని ఫాతిమామాత ఉత్సవాలు బుధవారం రెండో రోజు వైభవంగా సాగాయి. బుధవారం సాయంత్రం కేథడ్రల్ చర్చిలో ఫాతిమామాత స్వరూపంతో మహా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని బిషప్ ఉడుమల బాల ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఫాతిమానగర్‌లో ప్రారంభమైన ఈ ర్యాలీకి వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ ర్యాలీ సెయింట్ గ్యాబ్రియెల్ స్కూల్ రోడ్, ఫాతిమా ఆస్పత్రి మీదుగా దర్గా వరకు సాగి తిరిగి ఫాతిమా కెథడ్రల్ చర్చి వరకు సాగింది. అనంతరం నూతనంగా నిర్మించిన ఫాతిమా ప్రధాన రహదారి తోరణం వద్ద ప్రత్యేక ఆశీర్వాద ప్రార్థన జరిగింది. అనంతరం కెథడ్రల్ చర్చిలో జపమాల ఉద్యానవనం ఆశీర్వాద కార్యక్రమం నిర్వహించారు. ఆ తర్వాత వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఫాదర్‌లు స్వస్థత ప్రార్థనలు చేశారు. మేరీ మాత గుహవద్ద క్రైస్తవులు పెద్దఎత్తున మొక్కులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు చర్చి ఆవరణలో మొక్కులు చెల్లించి నిద్ర చేశారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఫాదర్ టి.జోసఫ్, ఫాదర్ డి.జోసఫ్, కర్నూల్ పీఠం బోధకులు ఏరువ జోజిరెడ్డి భక్తులకు స్వస్థత ప్రార్థనలు చేశారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులతో ఫాతిమానగర్ జాతర వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా చర్చి కమిటీ అధ్యక్షుడు బొక్క దయాసాగర్ బృందం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలను తలెత్తకుండా స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి బృందం భారీ బందోబస్తు నిర్వహించారు. రాత్రి పునీత ఆంథోని కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఎర్రగట్టు వేంకన్న జాతరకు వేళాయే..

- రేపటి నుంచి ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి.. పోలీసుల బందోబస్తు

హసన్‌పర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి (ఎర్రగట్టు జాతర) బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. కరీంనగర్ - హనుమకొండ ప్రధాన రహదారి సమీపంలోని అంబాల క్రాస్‌రోడ్డు వద్ద గుట్టపై వెలిసిన ఎర్రగట్టు వెంకటేశ్వరస్వామి జాతర ఏటా మార్చిలో హోలీ ఫాల్గుణ పౌర్ణమి రోజు ప్రారంభమై ఐదు రోజుల పాటు కొనసాగుతాయి. జాతరకు కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

హోలీ పర్వదినం నుంచి జాతర

యేటా హోలీ పర్వదినం రోజు నుంచే ఎర్రగట్టు జాతర కొనసాగుతూ వస్తోంది. సాయంత్రం హసన్‌పర్తి, భీమారం గ్రామాల ఆలయాల నుంచి శ్రీ అలివేలు మంగమ్మ పద్మావతి సమేత శ్రీనివాసుల ఉత్సవ మూర్తుల విగ్రహ ప్రతిమలతో ఊరేగింపుగా ఎర్రగట్టుగుట్టకు చేరుకుంటాయి. జాతరలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విశ్వక్‌సేనా సేవా సమితి కల్యాణ మండపంలో వేదపండితులు వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని నిర్వహించడంతో జాతర ప్రారంభమవుతుంది. 14వ తేదీ శుక్రవారం కల్యాణోత్సవం మొదటి రోజు రాత్రి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద రథచక్రాల బండ్లలో జాతర ప్రాంగణానికి చేరుకొని ధ్వజస్తంభం చుట్టూ ప్రదిక్షణలు చేసి స్వామివారి కల్యాణాన్ని చూసి తరించి మొక్కులు చెల్లించుకుంటారు. 15వ తేదీన రెండో రోజు శనివారం మేకలు, గొర్రెలు, పోతులు, ఏనుగులతో చిన్న రథచక్రాల బండ్లతో గుట్టకుచేరుకొని స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించు కుంటారు. 16వ తేదీ ఆదివారం స్వామివారి విశేషపూజ, కుంకుమార్చన, హారతి, ప్రసాద వినియోగం, 17వ తేదీ సోమవారం స్వామివారికి క్షీరాభిషేకం, అర్చనలు, 18వ తేదీ మంగళవారం ఉత్సవమూర్తు ల ప్రతిమలు ఇరు గ్రామాలకు తిరుగుపయణం కావడంతో జాతర ముగుస్తుంది.



గుట్టపైకి వెళ్లే మెట్లకి ఇరువైపుల ఏర్పాటు చేసిన పైప్‌లైన్



ఎర్రగట్టు వెంకటేశ్వరస్వామి

పోలీసు బందోబస్తు

ఐదు రోజుల పాటు జరిగే జాతర ఉత్సవ వేడుకల కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీటితో పాటు రాత్రి వేళలోగుట్టపైకి వెళ్లే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా వీధి దీపాలను ఏర్పాటు చేశారు. గుట్టపైకి మెట్లు ఎక్కే క్రమంలో భక్తులకు ఏవిధమైన ఆటంకాలు జరుగకుండా ప్రత్యేకంగా పోలీసు బం దోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణంలో దొంగతనాల నివారణ తో పాటు పోకిరీల ఆగడాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా పోలీసు నిఘాను పెంచారు. మఫ్టీలో పోలీసు గస్తీని ఏర్పాటు చేసినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు. భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జాతర ప్రాంగణంలో ప్రత్యకంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి



వివిధ ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వెంకట్రావ్ తెలిపారు. భక్తుల కోసం ప్రత్యేకంగా ఆర్‌టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కరీంనగర్ - హనుమకొండ ప్రధాన రహదారి నుంచి జాతర ప్రాంగణం వరకు ఆర్‌టీసీ వారు ప్రత్యేకంగా బస్సులను నడిపుస్తున్నారని తెలిపారు. దేవాలయం ప్రాంగణంలో టీటీడీ కల్యాణ మండపంతో పాటు నవగ్రహాలు, శివాలయం, అభయాంజనేయస్వామి ఆలయం, గోశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేశఖండన కోసం ప్రత్యేక స్థలం, జాతర మొదటి రోజు నిర్వహించే కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తుల కోస ప్రత్యేకంగా టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

\- ఆలయ కార్యనిర్వాహణ అధికారి వెంకట్రావ్

రంజాన్ రుచుల వేదిక మండిబజార్

- నోరూరిస్తున్న స్పెషల్ స్వీట్లు
- ఆస్వాదిస్తున్న నగర వాసులు
- పోషక విలువలతో కూడిన పదార్థాలకు డిమాండ్



మండిబజార్‌లో మసీద్ వద్ద సందడి

మట్టెవాడ మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలను అత్యంత నిష్ఠతో పాటిస్తున్నారు. అయితే ఈ ఆధ్యాత్మిక సౌరభాల రంజాన్ మాసంలో నెల రోజుల పాటు వారు దాన ధర్మాలు చేయడంతో పాటు.. విభిన్న రకాల వంటకాలు, రకారకాల స్వీట్లు, ఫలాలతో పండుగ జరుపుకొంటారు. ఈ క్రమంలో నగరంలోని మండిబజార్‌లో ఆధ్యాత్మిక సందడి కనిపిస్తుంది. రంజాన్ మాసం ప్రారంభం నుంచి నెల రోజుల పాటు రోజంతా కొనుగోళ్ల జోష్ కనిపిస్తుంది. అర్ధరాత్రి వరకు వ్యాపార సముదాయాలు తెరిచే ఉంటాయి. పోచమ్మమైదాన్, బండిబజార్ వరకు సుమారు కిలోమీటర్ మేరకు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటవుతాయి. అలంకరణ వస్తువులు, రోల్‌గోల్డ్ దుకాణాలు, కర్జూర పండ్లు వివిధ రకాల స్వీట్ల దుకాణాలు ఏర్పాటు చేశారు.

నోరూరించే రుచులు..

స్వీట్స్ అంటే ఇష్టపడని వారు ఎవరుంటారు. అందులోనూ ఏడాదిలో ఒక నెల మాత్రమే అందుబాటులో ఉండే స్పెషల్ స్వీట్లు అంటే ఇంకేలా ఉంటుంది. ప్రస్తుతం రంజాన్ స్పెషల్ స్వీట్ల మధురానుభూతిని అందిస్తున్నాయి. వరంగల్ పోచమ్మమైదాన్. మండిబజార్‌లో రుచి, పోషక విలువలు, శరీర ఆరోగ్యానికి సంబంధించిన పలు పదర్థాఆలు మిళితమై ఉండటంతో చిన్న, పెద్ద తేడా లేకుండా కులమతాలకు అతీతంగా ప్రజలంతీ తీసుకుంటున్నారు. దీంతో రంజాన్ స్పెషల్ స్వీట్లకు మంచి డిమాండ్ పెరిగింది. ఎన్నో రకాల వెరైటీ స్వీట్లు అందుబాటులో ఉండటంతో ఇళ్లకు పార్శిల్ తీసుకెళ్ళి మరి రుచులు ఆస్వాదిస్తున్నారు. ముఖ్యంగా డబుల్‌కా మీఠా, కద్దుకీ ఖీర్, మ్యాంగో ఖీర్, కుర్బానీ కా మీఠా, హల్వా, ఫెర్నీ, రబ్బి తదితర స్వీట్లకు డిమాండ్ ఉంది. నగరంలో అనేక చోట్ల అమ్మకాలు జరుగుతున్నా.. కేవలం మండిబజార్ ప్రాంతంలోనే సుమారు 20వరకు షాపులు ఉండటం విశేషం. ఇక్కడి వర్తకులు పోటీపడి మరీ ప్రజలకు ప్రత్యేక వంటకాలను పరిచయం చేస్తున్నారు.



పండ్లను విక్రయిస్తున్న దృశ్యం

డబుల్ కా మీఠా....

రంజాన్ స్పెషల్ స్వీట్లలో డబుల్ కా మీఠాను ప్రతీ ఒక్కరు ఇష్టపడుతారు. బ్రెడ్, డాల్డా, నూనె, పాలు, నెయ్యి, చెక్కర, కస్టర్డ్ పౌడర్, కోవా, బాదాం, కిస్‌మిస్‌లతో డబుల్ కా మీఠాను తయారు చేస్తారు. ఇది ఎంతో తియ్యగా ఉండటంతో ప్రతి ఒక్కరు దీనిని ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ఇది మార్కెట్లో ఒక ప్లేటు రూ.30 ఉంది.

ఖద్దుకీ ఖీర్..

రంజాన్ పండుగ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది ఖద్దుకీ ఖీర్. దీనిని రంజాన్‌లో ప్రత్యేక వంటకంగా భావిస్తారు. దీనిని ఇష్టపడని వారు ఉండరు. పాలు, సొరకాయ, కోవా, సాపుదాని బియ్యం, చెక్కర, పిస్తా, బాదం, ఇలాచీ, నెయ్యి, మిల్క్‌మ్యాట్ వినియోగించి దీనిని తయారు చేస్తారు. ఇది తాగితే శరీరంలోని వేడి పోతుందని, ఆరోగ్యకరమైన పానీయమని అమ్మకందారులు చెబుతున్నారు.

మ్యాంగో ఖీర్..

రంజాన్ స్పెషల్ స్వీట్లలో బాగంగా తయారు చేసే మ్యాంగో ఖీర్ కొన్ని చోట్ల మాత్రమే లభిస్తుంది. మామిడి పండ్ల గుజ్జును తీసి పాలు, మిల్క్‌మ్యాట్, కోవ ఉపయోగించి దీనిని తయారు చేస్తారు.

హల్వా..

గుమ్మడికాయ, నెయ్యి, కాజు, పాలు, బాదం, చెక్కరతో హల్వాను తయారు చేస్తారు. దీనిని చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతిఒక్కరు ఇష్టపడుతున్నారు.



రంజాన్ ప్రత్యేక రుచుల విక్రయాలు

కుర్బానీ కా మీఠా..

రంజాన్ స్పెషల్ స్వీట్లలో కుర్బానీ కా మీఠా మరీ స్పెషల్‌గా చెప్పుకోవచ్చు. కుర్బానీ కా మీఠాను ఆఫ్ఘనిస్థాన్ నుంచి దిగుమతి అయ్యే డ్రైఫ్రూట్లతో తయారు చేస్తారు. డ్రైఫ్రూట్స్‌ను నీటిలో నానాబెట్టి తరువాత గింజలు తీసివేసి పంచదార పాకంలో రోజ్‌బెర్రి, సిరప్‌లు వినియోగించి తయారు చేస్తారు. దీనికి మార్కెట్లో మంచి గిరాకి ఉంది. ఇది అరుదుగా లభించే స్వీటు.

ఫిర్నీ..

ఇది చాలా అరుదుగా లభించే వంటకం. బాస్మతి రైస్‌ను రవ్వగా చేసి ఉడకబెడుతారు. తరువాత చెక్కర, కోవ, మిల్క్‌మ్యాట్‌తో దీనిని మహా రుచిగా తయారు చేస్తారు.

రబ్బి..

పాలు, కస్టర్డ్ పౌడర్, చెక్కర, మిల్క్‌మ్యాట్ ఉపయోగించి రబ్బి స్వీట్‌ను తయారు చేస్తారు. ఇది కొన్ని చోట్ల మాత్రమే లభిస్తుంది. దీనికి మంచి డిమాండ్ ఉంది.

గ్రూప్-2లో టౌన్ ఎస్సై శివకుమార్‌కు 25వ ర్యాంకు



మహబూబాబాద్ రూరల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గ్రూప్-2 పరీక్ష ఫలితాల్లో మహబూబాబాద్ టౌన్ ఎస్సై కూటికంటి శివకుమార్ రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించారు. 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగిన గ్రూప్-2 పరీక్షను శివకుమార్ రాశారు. ఈనెల 11న రాత్రి వెలువడిన ఫలితాల్లో 600 మార్కులకు గాను 410 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో 25వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం తిరుమలగిరికి చెందిన కూటికంటి వెంకన్న-లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. హైదరాబాద్‌లో బీటెక్ విద్యనభ్యసించారు. 2020లో పోలీస్‌శాఖలో ఎస్సైగా ఎంపికైన శివకుమార్ శిక్షణ పూర్తి చేసిన అనంతరం 2022లో తొలి పోస్టింగ్‌లో మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎస్సైగా విధులు నిర్వహించారు. అనంతరం మహబూబాబాద్ టౌన్ ఎస్సైగా బదిలీపై వచ్చి, ప్రస్తుతం ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు.

పాలిటెక్నిక్ ఫార్మసీ లెక్చరర్‌గా నియామక పత్రం



ప్రణీత

చిన్నగూడూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు గ్రామానికి చెందిన పల్లెర్ల ప్రణీత సెప్టెంబరు 2023 తెలంగాణ పాలిటెక్నిక్ లెక్చరర్ ఫార్మసీ ఉద్యోగ నియామకానికి పరీక్ష రాశారు. ఏప్రిల్ 20, 2024లో వెల్లడించిన ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఈ మేరకు ప్రజాప్రభుత్వం కొలువుల పండుగ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో వరంగల్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కాలేజీలో ఫార్మసీ లెక్చరర్‌గా పల్లెర్ల ప్రణీతకు ఉద్యోగ నియామకపత్రాన్ని టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ పుల్లయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను గ్రామస్థులు అభినందించారు.

గణిత అధ్యాపకురాలిగా స్వరూప ఎంపిక



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : దామ్యతండా శివారు తోకబోడుతండాకు చెందిన హతిరాం-బుజ్జి దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. హతిరాం-బుజ్జి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను ఉన్నత విద్యను చదివించారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో బీఎస్సీ, ఎంఎస్సీ (మ్యాథ్స్) పూర్తి చేసింది. 2023 సెప్టెంబరులో జూనియర్ అధ్యాపక పోస్టుకు పరీక్ష రాయగా, 2024 సెప్టెంబరులో ఫలితాలు వెలుపడాగా ఆ ఫలితాల్లో స్వరూపకు 450 మార్కులకు గాను 323 మార్కులు సాధించి ఎస్టీ మహిళా విభాగంలో మొదటి ర్యాంకు, ఎస్టీ జనరల్ విభాగంలో 3వ ర్యాంకు, జనరల్ విభాగంలో 191వ ర్యాంకులో నిలిచింది. డిసెంబరు నెలలో నిర్వహించిన సర్టిఫికెట్లను పరిశీలించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన నియామకపత్రాల పంపిణీ కార్యక్రమంలో సీఎం నుంచి అందుకున్నారు.

స్వల్పంగా తగ్గిన మొక్కజొన్న ధర

- కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో క్వింటాకు రూ.2,254
- అయినా 'మద్దతు'కు మించిన రేటు
- మరింత రేటు తగ్గే అవకాశం

కేసముద్రం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మొక్కజొన్న ధరలు స్వల్ప హెచ్చుతగ్గులకు గురవుతున్నాయి. బుధవారం మార్కెట్‌కు 61 మంది రైతులు 3417 బస్తాల్లో మొక్కజొన్నలు తీసుకురాగా ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) విధానంలోని ఈ-వేలంలో క్వింటాకు గరిష్ఠంగా రూ.2271, కనిష్ఠంగా రూ.1859, సగటున రూ.2254 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. మార్కెట్‌కు గతనెల చివరి వారం నుంచి మొక్కజొన్నను రైతులు విక్రయించేందుకుతీసుకువస్తున్నారు. సీజన్ ఆరంభంలో క్వింటాకు రూ.2,309 నుంచి రూ.2,312 మధ్యన ధరల ఉండగా ఈనెల ఆరంభంలో వారంలో రూ.2,290 నుంచి రూ.2,306 వరకు స్వల్పంగా తగ్గాయి. ఈ వారంలో క్వింటాకు మరో రూ.60లు తగ్గి రూ.2240 నుంచి రూ.2,290 వరకు సగటు ధరలు నమోదయ్యాయి. అయితే మొక్కజొన్నకు ప్రభుత్వ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్విం టాకు రూ.2225 ఉండగా ఈ సీజన్లో మార్కెట్లో ఈ ధరకంటే తక్కువగా నమోదు కాకపోవడం గమనార్హం. మొక్కజొన్న ముడిసరుకుగా ఉన్న పరిశ్రమల నుంచి డిమాండ్ ఉన్నప్పటికీ ఆయా కంపెనీలు తక్కువ ధరతో కొనుగోలు చేసి నిల్వపెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడి నుంచి ఎగుమతి అయిన సరుకు కొన్ని కంపెనీల వద్ద దిగుమతి అయ్యేందుకు చాలా సమయం పడుతున్నట్లు సమాచారం. మరోవైపు బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో కోళ్ల పరిశ్రమలో సంక్షోభంతో దాణా తయారీ సంస్థలు ఆచితూచి మొక్కజొన్న ఖరీదులు చేస్తున్నాయి. ఈ కారణాలతోనే హోల్‌సేల్ మార్కెట్లో స్వల్పంగా మొక్కజొన్నలకు ధర తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మరో రెండు వారాల్లో పూర్తిస్థాయిలో మొక్కజొన్న సీజన్ ప్రారంభం కానుంది. ప్రస్తుతం మార్కెట్‌కు మొక్కజొన్నలు 4వేల నుంచి 8వేల బస్తాల వరకు రైతులు విక్రయించేందుకు తీసుకువస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే రెండు వారాల్లో క్వింటాకు మరో రూ.50 వరకు ధర తగ్గే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు.



మార్కెట్‌కు బుధవారం విక్రయానికి వచ్చిన మొక్కజొన్నలు



మండల మహాసభలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి

గార్ల, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాకాల ఏటీ పరివాహక ప్రాంతాల్లో సాగు చేసిన రబీ పంటలను కాపాడాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సర్కార్ ఎస్సారెస్పీ ద్వారా పాకాల ఏటీకి నీటిని మళ్లించి, పంటలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాని కోరారు. బుధవారం మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలో సీపీఐ అనుబంధ రైతుసంఘం 3వ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు తీవ్రంగా నష్ట పోవడం జరుగుతుందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక గ్రామాల్లో రైతులు ఆత్మహత్య చేసుకోనే పరిస్థితి వచ్చిందని, ఆందోళన వ్యక్తం చేశారు. మహాసభ అనంతరం రైతు సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు కట్టెబోయిన శ్రీనివాస్, మండల కార్యదర్శి జంపాల వెంకన్న. కట్టెబోయిన భిక్షమయ్య, సింగు రమేష్. మాగం లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకన్న బ్రహ్మోత్సవాలు షురూ



పద్మావతి, అలువేలు మంగ సహిత వేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

నర్సింహులపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రం శివారు ఇంద్రకీలాద్రి పర్వతంపై కొలువుదీరిన పద్మావతి, అలువేలు మంగ సహిత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఫాల్గుణ త్రయోదశి బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ జెడ్పీ మాజీ చైర్మన్ మేరుగు సత్యనారాయణ గౌడ్-విమల దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయం అర్చకులు శ్రీనందనాచార్యులు, పవన్‌కుమార చార్యులు, రామాచార్యుల పర్యవేక్షణలో తొలక్కం, ప్రబంధకాలంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో వేణుగోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, గౌని యాదగిరి, మేరుగు భరత్‌గౌడ్, యాకయ్య, జూనియర్ అసిస్టెంట్ మార్క శేఖర్, ఆలయం సిబ్బంది పాల్గొన్నారు.

అనంతాద్రిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న అర్చకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని అనంతాద్రి స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రెండో రోజు బుధవారం సాయంత్రం బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు గొడవర్తి చక్రధరాచార్యుల వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, సేవాకాలం, నివేదన, వేదవిన్నపం, తీర్థప్రసాద గోష్టి, 9 గంటలకు ద్వారతోరణం ధ్వజకుంభారాధన, చతుస్థానార్చన, నిత్యహవనం, తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రపారాయణం, ద్వారా తోరణ, ధ్వజకుంభారాధన, చతుస్థానార్చన, నిత్యహవనం, నిత్యపూర్ణాహుతి, దేవతాహ్వానం, భేరితాడవనం, నివేధన, బలిహరణ, వేదవిన్నపం, తీర్థప్రసాద గోష్టి పూజాకార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకల్లో ఆలయ ట్రస్టు చైర్మన్ నూకల రాంచంద్రారెడ్డి -జ్యోతి దంపతులు, ట్రస్టు బాధ్యులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, మాలె కాశీనాథ్, మల్యాల రంగారావు, అర్చకులు గొడవర్తి శ్రీనివాసచార్యులు, అనిరుద్దాచార్యులు, విశ్వం, రవికిరణాచార్యులు, మట్టపల్లి విజయ్, గౌతమ్, చరణ్ భక్తులు పాల్గొన్నారు.

4.50 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటిక స్వాధీనం

మహబూబాబాద్ రూరల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారు అనంతారం సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన 4.50 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పట్టిక, 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. అనంతారం శివారులో కోల్డ్ స్టోరేజ్ సమీపంలోని ఆర్తిగార్డెన్ సమీపంలోని కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులు ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు నల్లబెల్లం, పటికను కొనుగోలు చేసి గుడుంబా కాచేవారికి అధిక ధరలకు విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు చెప్పారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి, వారి వద్ద నుంచి 4.50 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటిక, 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. వాటి విలువ సుమారు రూ.1.87 లక్షలు ఉంటుందన్నారు. పాషాను అదుపులోకి తీసుకోగా విజ్జు, విజయ్ పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని కూడా పట్టుకుంటామని ఎస్సై దీపికరెడ్డి వెల్లడించారు.

పీవోహెచ్ ఏర్పాటుకు కేంద్రమంత్రికి లేఖ



కేంద్రమంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

కేసముద్రం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే పీరియాడిక్ ఓవర్ హాల్ (పీవోహెచ్) ఏర్పాటుకు రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ బుధవారం లేఖ రాసినట్లు స్థానిక బీజేపీ జిల్లా కోశాధికారి వేలం శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 4న కరీంనగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ ని కలిసి తాను వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. రైల్వే లోకోమోటీవ్‌లు, కోచ్‌ల నిర్వహణకు ఉపయోగపడే పీవోహెచ్‌తోపాటు కేసముద్రం రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలను అభివృద్ధి చేయడంపై కూడా రైల్వేశాఖకు మంత్రి మరో లేఖ రాసినట్లు ఆయన చెప్పారు.

ఇసుక సమస్యను పరిష్కరించాలి : సీఐటీయూ

ఇనుగుర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వివిధ నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుక 15 రోజుల నుంచి రవాణాను ప్రభుత్వం నిలిపివేయడంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ అన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రంలో బుధవారం ఆ సంఘ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో దుంపల రాజయ్య, ఉత్తెపు శ్రీనివాస్, ఆవుల వెంకన్న, ఉప్పలయ్య, మట్టపల్లి మహేష్, కొనకటి హరిబాబు, మట్టపల్లి అశోక్, నర్సయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థులు

డోర్నకల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్జీఎఫ్ఐ అండర్-14 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు చిల్కోడు మోడల్‌స్కూల్ చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చావ కృష్ణభాను బుధవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ఎంపికైన 9వ తరగతి విద్యార్థిని సరస్వతి, 8వ తరగతి విద్యార్థిని తన్వీక, విద్యార్థి ఆదర్శ్‌లు ఈనెల 14 నుంచి 16 వరకు వనపర్తిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికైనా విద్యార్థులను, పీడీ గోవర్ధన్‌లను ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మల్యాల కేవీకేను సందర్శించిన విద్యార్థులు

కేసముద్రం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంతో పాటు ఉద్యానవన కేంద్రాన్ని బుధవారం కేసముద్రం శ్రీవివేకవర్ధిని హైస్కూల్ 8, 9వ తరగగతుల విద్యార్థులు సందర్శించారు. కేవీకే శాస్త్రవేత్తలు మాలతి, క్రాంతికుమార్ విద్యార్థులకు వివిధ వ్యవసాయ అంశాలపై వివరించారు. విద్యార్థులకు పుస్తకాలతోనే కాకుండా ఇలాంటి క్షేత్రపర్యటనలతో మరింత విషయావగాహనకలుగుతుందని కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ తెలిపారు. ఉపాధ్యాయులు హఫీజ్, కూరెళ్లి సుభాష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వం నియామకాలు ఆపాలి

కేసముద్రం, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించేంత వరకు ఉద్యోగ నియామకాలు, ఉన్నత విద్య ప్రవేశాలు నిలిపివేయాలని ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము నాగరాజు డిమాండ్ చేశారు. కేసముద్రం పూలే సెంటర్‌లో బుధవారం ఆ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఈ మేరకు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు, అడ్మీషన్లు చేపడితే రిజర్వేషన్ ఫలాలు అందక తాము నష్టపోతామని అన్నారు. సంఘం గ్రామ అధ్యక్షుడు వల్లందాస్ మహేష్, ప్రధాన కార్యదర్శి మామిళ్ల ప్రేమ్‌కుమార్, కొమ్ము యాకయ్య, దుర్గం ఆకాశ్, గుజ్జునూరి నవీన్, కొమ్ము రాధ, బొందమ్మ, అనసూర్య పాల్గొన్నారు.

గాంధీ చూపిన మార్గాలు అనుసరణీయం

మహబూబాబాద్ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గాంధీజీ చూపిన అహింస, సత్యం, శాంతి ప్రపంచదేశాలకు అనుసరణీయమని గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. దండి మార్చి స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్‌లో గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు చేపట్టే కార్యక్రమాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను డీఈవో రవీందర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాలను ప్రపంచ మేధావులు మార్టిన్‌లూథర్‌కింగ్, ఐన్‌స్టీన్, దైలైలామాలాంటి వారు ఆదర్శంగా తీసుకుని సమాజసేవకు పాటు పడ్డారని చెప్పారు. డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్న విద్యాశాఖ అధికారులు రాజేశ్వర్‌రావు, అప్పారావు, విజయకుమారి, మందుల శ్రీరాములు పాల్గొన్నారు.

30 శాతం నిధులు కేటాయించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : రాబోయే తెలంగాణ బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గందసిరి జ్యోతిబసు, పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. రాకేష్, మురళీ, కల్యాణ్, వంశీ, అరుణ్, మహేష్, వినోద్ పాల్గొన్నారు.

గిరిజన న్యాయవాదుల సమాఖ్య జిల్లా కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ రూరల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : గిరిజన న్యాయవాదుల సమాఖ్య మహబూబాబాద్ జిల్లా కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబాబాద్‌లో బుధవారం గిరిజన న్యాయవాదులంతా సమావేశమై జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా భూక్య మోహన్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా బాలాజీనాయక్, కార్యదర్శిగా లాలునాయక్, కోశాధికారిగా మున్నాచౌహాన్, సహాయ కార్యదర్శిగా బానోత్ భాస్కర్‌నాయక్, స్పోర్ట్స్‌అండ్‌కల్చరల్ కార్యదర్శిగా భూక్య గుషాల్, మహిళా కార్యదర్శిగా గుగులోతు సునీతను ఎన్నుకున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెద్దవంగర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్ఎం కళాధర్ అన్నారు. బుధవారం మండలంలోని అవుతాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీసు సిబ్బంది సంతోష్, కల్యాణ్, హరీష్ ఆధ్వర్యంలో గర్ల్స్ చైల్డ్ ఎంపవర్మెంట్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930టోల్ ఫ్రీ నెంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్‌కుమార్, నరసింహరావు, వెంకటేశ్వర్లు, సింహాద్రి పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో ముందువరుసలో నిలవాలి

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



వాసవీక్లబ్ కపుల్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్,మార్చి12 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవల్లో స్వచ్ఛంద సంస్థలు పోటీపడుతూ నిరుపేదలకు సాయం చేస్తూ ముందువరుసలో నిలవాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. స్థానిక ఆర్‌సీ కన్వెన్షన్‌హాల్లో మంగళవారంరాత్రి వాసవిక్లబ్ కపుల్స్ మహబూబాబాద్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడు నాళ్ల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి జంగాల విజయ్, కోశాధికారి వనమాల సురేష్‌చే క్లబ్‌వైస్ గవర్నర్ రామ ఉపేందర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మానుకోట ప్రాంతంలో వాసవిక్లబ్ సేవలు అమోఘనీయమని, వాటిని మరింత విస్తరింప చేయాలని సూచించారు. అనంతరం మహిళ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ వైస్‌ప్రెసిడెంట్ మాలె యోగీశ్వర్‌రావు, సునీత, డీపీవో విజయనిర్మల, ఎస్సై దీపిక, మౌనిక, సోమ సుమతి, ఇమ్మడి కృష్ణమూర్తి, వల్లాల రమేష్, బొల్లం శ్రీనివాస్, ఈగ శ్రీనివాస్, సదాశివుడు, నవీన్, అంబరీష, శ్రీధర్, నర్సింహారావు, లక్ష్మినారాయణ, విజయ్‌కుమార్, నవీన్, రవి, మంగపతి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలెరో వాహనం

- ఇద్దరికి తీవ్ర గాయాలు

మరిపెడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను బొలెరో వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని శ్రీరామ పెట్రోల్ బంక్ దగ్గర ఎన్‌హెచ్‌ఏ 365పై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్‌కు చెందిన నరేందర్‌నాయక్, హనుమకొండకు చెందిన గొర్రె కుమార్ బైక్‌పై మరిపెడ నుంచి మహబూబాబాద్‌కు వెళ్తుండగా వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న బొలెరో బైక్‌ను బలంగా ఢీకొంది. 20 మీటర్ల దూరం వరకు బైక్‌తో పాటు క్షతగాత్రులను ఈడ్చుకెళ్లింది. దీంతో నరేందర్‌నాయక్, గొర్రె కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మరిపెడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని..

- ఇద్దరికి తీవ్ర గాయాలు

గార్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పూమ్యాతండా, శేరిపురం వెళ్లు రహదారిలో రెండు మోటార్ సైకిళ్లు బుధశారం రాత్రి ఢీ కొట్టుకోవడంతో ఇరురికి తీవ్ర గాయాలయ్యాయి. గార్ల నుంచి మహిళ తన మోటార్ సైకిల్‌పై శేరిపురం పోవుచున్న సమయంలో అటువైపు నుంచి ఎదురుగా అతి వేగంతో మరో మోటార్ సైకిల్ ఒక్కసారిగా ఢీకొట్టుకున్నాయి. దీంతో మోటార్ సైకిల్ నడుపుతున్న ఎల్.లలితకు తలకు తీవ్రగాయాలు కావడంతో రోడ్డుపై ప్రయాణించే బాటసారులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. మెరుగైన వైద్యం కోసం మహబూబాబాదక్ష ఏరియా ఆసుపత్రికి వారిని తరలించారు.

ప్రగతి సేవా సమితి సేవలు అభినందనీయం

- తహసీల్దార్ నాగరాజు

నర్సింహులపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పేదల కోసం ప్రగతి స్వచ్ఛంద సేవా సమితి వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని తహసీల్దార్ సీహెచ్.నాగరాజు, ఎస్సై సురేష్ అన్నారు. బుధవారం ఆ సంస్థ, ఐకేపీ సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్ శంకర కంటి వైద్యశాల సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ఎంపీడీవో కిన్నెర యాకయ్య, ప్రగతి సేవా సంస్థ వ్యవస్థాపకుడు గద్దల జాన్, ప్రోగ్రాం ఆఫీసర్ గద్దల రాజు, రాజ్‌కుమార్, క్లస్టర్, మండల కోఆర్డినేటర్లు చెడుపాక వెంకన్న, దుడ్డెల సుస్మిత, పరశురాములు, రాధ, ఉమాదేవి, వైద్య సిబ్బంది, ఐకేపీ సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగడి వేలం ఖరారు

నర్సింహులపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దనాగారం స్టేజీ గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడి వేలం బుధవారం ఖరారైంది. కార్యదర్శి గోరెంట్ల వనిత అధ్యక్షతన ఎంపీడీవో కిన్నెర యాకయ్య, గ్రామ ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు పర్యవేక్షణలో నిర్వహించిన అంగడి వేలంలో జగ్యాతండాకు చెందిన బానోత్ భాస్కర్‌నాయక్ రూ. 46 వేలకు సంత టెండర్‌ను సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొబ్బ సోమిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కొమ్ము అనిల్, మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ శ్రేణులు ఉన్నారు.

బాలికల విద్యతోనే కుటుంబానికి రక్షణ

- మహిళా సాధికారత డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ మహేశ్వరి

మరిపెడ, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : బాలికల విద్యతోనే కుటుంబానికి అన్నిరకాల రక్షణ ఉంటుందని మహిళా సాధికారత డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ మహేశ్వరి అన్నారు. బుధవారం మరిపెడ హైస్కూల్‌లో 'బేటీ బచావో-బేటీ పడావో' అనే కార్యక్రమాన్ని ఆ స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం రామ్మోహన్ అధ్యక్షతన మహిళ శిశు సంక్షేమ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలికల రక్షణ, హక్కులను వివరించారు. ఆపద సమయంలో టోల్ ఫ్రీ నంబర్లు 181, 100, 1098, 1930, 14567కు కాల్‌చేస్తే తక్షణ సహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, జెండర్ స్పెషలిస్ట్‌లు అరుణ, సౌజన్య, ఫైనాన్స్ లిటరసి స్పెషలిస్ట్ సంధ్యారాణి, టీచర్లు పాల్గొన్నారు.

నీటి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

తొర్రూరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాగునీటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం తొర్రూరు మండలం మడిపల్లి, సోమారపుకుంటతండాల్లో వరి పంటలను ఏవో భాస్కర్‌తో కలసి పరిశీలించారు. వేసవిలో ప్రస్తుతం ఉన్న నీటిని తడులుగా పొలాలకు అందించుకోవాలని నీటి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రస్తుతానికి వరి పొట్టదశలో ఉందని ఎక్కడ పూర్తిస్థాయిలో ఎండిపోలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఆమని, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

- తొర్రూరు డిగ్రీ కళాశాల అధ్యాపకులు

తొర్రూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తుందని తొర్రూరు డిగ్రీ కళాశాల అధ్యాపకులు బుధవారం తొర్రూరులో ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో అనుభవజ్ఞులైన అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు ఉన్నారని, విద్యార్థులకు టీఎస్‌కేసీ ద్వారా అవసరమైన నైపుణ్యాలు, కంప్యూటర్ శిక్షణ, స్కాలర్‌షిప్, డిజిటల్ తరగతులు, హాస్టల్ సౌకర్యం, ఎన్ఎస్ఎస్ ద్వారా ఉత్తమ వ్యక్తిత్వ వికాసం, విశాలమైన ఆట స్థలం, నైపుణ్యాల గుర్తింపు, విశ్వవిద్యాలయం స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పించాలని కోరారు. అధ్యాపకులు రవీందర్‌రెడ్డి, సునిల్, వాల్యా, శ్రీనివాస్, సోము, విజయ, విద్యార్థులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గార్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బుద్దారం కొత్తతండాలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తన యోజకవర్గ అభివృద్ధి నిదుల నుండి రూ.5 లక్షలతో ఎమ్మెల్యే అదేశాల మేరకు బుధవారం పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాల్లోని మౌళిక సమస్యలు పరిష్కారం కోసం కోరం కనకయ్య చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు గుగులోత్ సుమన్, కుమార్, రవి, రాంబాబు, గుగులోత్ హరి నాయక్, బాలకృష్ణ పాల్గొన్నారు.